సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

ఆదివారం । 5 । ఫిబ్రవరి । 2023



తొలిదశలో గుర్తిస్తే క్యాన్సర్ నియంత్రణ సాధ్యమే

క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించి చికిత్స అందిస్తే నియంత్రణ సాధ్యమేనని రిమ్స్ ప్రిన్సిపాల్ సురేఖ అన్నారు. -8లో..



క్రీడలతో మానసికోల్లాసం

కడప డీఎస్‌ఏ క్రీడామైదానంలో నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు క్రీడాకారుల నుంచి చక్కటి స్పందన లభించింది. -8లో..

గరిష్టం/కనిష్టం
32.0/17.2

వాతావరణం

జిల్లాలో శనివారం 17.2 - 32.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

6న వేంపల్లిలో జిల్లాస్థాయి షూటింగ్ బాల్ ఎంపికలు

కడప స్పోర్ట్స్ : వేంపల్లి పట్టణంలోని వైఎస్‌ఆర్ వివేకానంద డిగ్రీ కళాశాలలో ఈనెల 6వ తేదీ ఉదయం 9 గంటలకు జిల్లాస్థాయి షూటింగ్‌బాల్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి మాదినేని నిత్యపూజయ్య తెలిపారు. సీనియర్ మహిళలు, పురుషుల విభాగం ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు కృష్ణాజిల్లా హనుమాన్ జంక్షన్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. క్రీడాకారులు ఆధార్‌కార్డు వెంట తీసుకురావాలని సూచించారు. పూర్తి వివరాలకు 93916 52133 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నిరుద్యోగులకు శిక్షణ, ఉపాధి

కడప కల్చరల్: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కడప నగరం మోచంపేటలోని శ్రీ రామకృష్ణ హైస్కూలులో నిరుద్యోగ యువతకు పలు అంశాలలో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించనున్నారని ఫౌండేషన్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా బిజినెస్ అసోసియేట్ కోర్సుల్లో ట్యాలీ, కంప్యూటర్ బేసిక్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో 35 రోజులపాటు ఉచిత శిక్షణ ఇచ్చి అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. 18–25 సంవత్సరాలలోపు వయస్సు కలిగి టెన్త్, ఇంటర్, డిగ్రీ పాస్/లేదా ఫెయిల్ అయిన యువతీ యువకులు ఈ శిక్షణకు అర్హులని, హాస్టల్ వసతి కూడా కల్పిస్తున్నామన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు పూర్తి వివరాలకు నేరుగా కడపలోని రామకృష్ణ హైస్కూలులోగల సంస్థ కార్యాలయంలోగానీ, 80080 32358 నెంబరులోగానీ సంప్రదించాలని సూచించారు. మొదటి బ్యాచ్ ఈనెల 18వ తేది నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు.

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్, సీడ్యాప్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ సర్వేయర్ శిక్షణకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. 90 రోజులపాటు కొనసాగే ఉచిత శిక్షణలో భోజన, వసతి సౌకర్యాలు, శిక్షణకు అవసరమైన స్టేషనరీ, షూ, యూనిఫాం ఉచితంగా అందజేస్తామన్నారు. నిపుణులతో శిక్షణ ఇప్పించి సర్టిఫికెట్లను ప్రదానం చేసి ఉపాధి కల్పిస్తామన్నారు. అభ్యర్థులు 18-35 సంవత్సరాల వయస్సు కలిగి టెన్త్/ఇంటర్/ఐటీఐ/ డిప్లొమా/డిగ్రీ చదివి ఉండాలన్నారు. అభ్యర్థులు తమ ఆధార్, రేషన్‌కార్డులు, పదవ తరగతి సర్టిఫికెట్, నాలుగు కలర్ పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో పులివెందులలో న్యాక్ శిక్షణా కేంద్రానికి ఈనెల 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు మొబైల్ నెంబరు 98853 31972, వాట్సాప్ నెంబరు 98853 31972 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

స్టేట్ మీట్‌లో లయోలా పాలిటెక్నిక్ విద్యార్థుల సత్తా

పులివెందుల టౌన్ : ఈనెల 1,2,3 తేదీలలో విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన ఐపీఎస్‌జీఎం స్టేట్‌మీట్‌లో పులివెందుల లయోలా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు 200 మీటర్ల పరుగు పందెంలో దినేష్‌కుమార్, లాంగ్‌జంప్‌లో భానుప్రకాష్‌లు మొదటిస్థానం సాధించారు. 4×100 రిలేలో మూడవస్థానం సాధించగా, టేబుల్ టెన్నిస్(డబుల్స్)లో మూడవ స్థానంలో నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ బ్రిటో, కరస్పాండెంట్ ఆంటోణి స్వామి తెలిపారు. తమ కళాశాల విద్యార్థులు స్టేట్‌మీట్‌లో సత్తాచాటడంపై వైస్ ప్రిన్సిపల్ విజయరాజు హర్షం వ్యక్తం చేశారు. వీరు మార్చిలో జరిగే జాతీయస్థాయి మీట్‌లో విజయఢంకా మోగించాలని ఆకాంక్షించారు.

పన్నులు సకాలంలో చెల్లించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : వాహన యజమానులు సకాలంలో పన్నులు చెల్లించాలని జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ మీరా ప్రసాద్ తెలిపారు. శనివారం జిల్లాలోని చాపాడు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం, రాజుపాలెం మండలాల్లో తనిఖీలు చేపట్టామన్నారు. ఈ తనిఖీల్లో భాగంగా 32 కేసులు నమోదు చేసి దాదాపు రూ. 33 లక్షలు జరిమానా రూపంలో వసూలు చేశామన్నారు.



- మాతా శిశుమరణాల తగ్గింపే లక్ష్యం
- సుఖ ప్రసవానికి 'కిల్కారీ కాల్స్' పేరుతో తెలుగులో సూచనలు
- శిశువు ఆరోగ్యంగా ఎదిగేందుకు జాగ్రత్తలు

జిల్లాలో గర్భవతులు: 17,660

బాలింతలు : 17,318



గర్భిణులకు 'కిల్కారీ కాల్స్'

కడప కోటిరెడ్డిసర్కిల్ : మాతా శిశు మరణాల తగ్గింపే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు చేపడుతున్నాయి. అందులో భాగంగా గర్భంతో ఉన్న మహిళ సరైన సమయానికి అవసరమైన జాగ్రత్తలు, మందులు తీసుకునేలా అలెర్ట్‌తో కూడిన ఫోన్ కాల్స్ వస్తున్నాయి. కిల్కారి కాల్స్ పేరుతో ఉన్న ఈ కాల్స్ దేశంలోని ఐదు భాషల్లో వస్తున్నాయి. ప్రస్తుతం తెలుగులో కూడా రావడంతో పలువురు గర్భిణులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మాతృభాషలో కాల్స్ రావడంతో వాటిని ఆచరించడం వల్ల గర్భిణీ సురక్షిత ప్రసవానికి ఉపయోగపడుతుందని అధికారుల నమ్మకం

- తల్లీబిడ్డ ఆరోగ్య సంరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాయి. మహిళ గర్భం దాల్చింది మొదలు బిడ్డకు జన్మనిచ్చేదాక ఏఎన్ఎంలు, ఆశాలు, ప్రత్యేక యాప్‌ల ద్వారా ఎప్పటికప్పుడు గర్భిణుల వివరాలు నమోదు చేస్తూ వస్తున్నారు. దీని ద్వారా గర్భిణీ ఆరోగ్య పరిస్థితి ఎప్పటికప్పుడు తెలిసిపోతుంది. అయితే ఇప్పుడు నేరుగా గర్భిణులతోనే మాట్లాడే విధంగా కిల్కారి కాల్స్ పేరిట మరో సాంకేతిక విప్లవాన్ని తీసుకు వచ్చారు.
- కిల్కారి అంటే తెలుగులో చిన్నారి చిరునవ్వు అని అర్థం. ఇటీవల ఈ విధానం జిల్లాలో కూడా అమలులోకి వచ్చింది. గర్భం దాల్చిన నాల్గవ నెల నుంచి పిల్లలు పుట్టిన ఏడాది వరకు ఏ వారంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఈ కాల్స్ ద్వారా ఒక వైద్యుడు తెలియజేసినట్లు వివరిస్తారు. ఈ మేరకు ప్రతి గర్భిణులకు వారి ఫోన్ నెంబరుకు 01133278000 అనే నెంబరు ద్వారా వారానికి ఒకసారి కాల్స్ వస్తాయి. ప్రతికాల్ రెండు నిమిషాల వ్యవధి కలిగి ఉంటుంది. మొదటిసారి కాల్ లిఫ్ట్ చేయకపోతే మరో రెండు సార్లు కాల్స్ వస్తాయి.
- గర్భిణీ సుఖప్రసవం కావడంతోపాటు బిడ్డకు జన్మనిచ్చాక కూడా ఆ శిశువు ఆరోగ్యంగా ఎదిగేందుకు ఈ కాల్స్ తోడ్పడుతున్నాయి. చేతుల పరిశుభ్రత లేకపోతే జరిగే నష్టాలు, అలాగే పిల్లలు విరేచనాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వయస్సుకు తగిన బరువు ఉండేందుకు ఏం చేయాలి? పిల్లలకు ఇవ్వాల్సిన ఆహారం వంటి సూచనలు, సలహాలు ఇందులో ఉంటాయి. ఈ విధానాన్ని 2016లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చినా ఇటీవలే విస్తృతంగా ప్రాచుర్యం కల్పించారు. మొదట్లో హిందీ, బెంగాలీ, బీహారి, ఒరియా, అస్సామి భాషల్లో ఈ సేవలు అందించారు. ప్రస్తుతం తెలుగులో కూడా ప్రారంభించారు.

ఫోన్‌కాల్స్ ఇలా ఉంటాయి

అన్నయ్య, వదినమ్మ నమస్కారం...బాగున్నారా? కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కిల్కారి మొబైల్ సేవ నుంచి వైద్యుడిని మాట్లాడుతున్నా....బిడ్డ ఆరోగ్య సంరక్షణకు మీరు ఆచరించేందుకు సులువుగా ఉండే విషయాలను చెబుతా వినండి...మనమంతా కలిసి మీ బిడ్డకు మెరుగైన భవిష్యత్తు అందిద్దాం అంటూ.. గర్భిణులకు నాల్గవ నెల నుంచి వాయిస్ మెసేజ్ వస్తుంది. బిడ్డ పుట్టిన తర్వాత నమస్కారం..మీకు తెలుసా? పుట్టిన గంటలోగానే బిడ్డకు పాలు తాపించాలి... తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆహారం. బిడ్డకు కావాల్సినవన్నీ ఈ పాలలో ఉంటాయని చెబుతారు.

కడప రాయుడికి పునర్వసు పూజలు

కడప కల్చరల్ : కడప నగరం దేవునికడపలోని శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామి, అమ్మవార్లకు పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను స్నానపీఠంపై కొలువుదీర్చి విశేష అభిషేకం నిర్వహించారు. అనంతరం పూలు, స్వర్ణాభరణాలతో అలంకరించి చిన్న తేరుపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు తమ ఆరాధ్య దైవాన్ని దర్శించుకుని పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



స్వామి, అమ్మవార్లకు హారతి ఇస్తున్న అర్చకుడు

కోదండ రామయ్యకు స్నపన తిరుమంజనం


ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో శనివారం స్వామికి వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ స్నపన తిరుమంజనం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ టీటీడీ అధికారుల ఆధ్వర్యంలో సుప్రభాత సమయాన శ్రీరామచంద్రమూర్తికి పట్టు వస్త్రాలు, పుష్పాలు, ఫలాలు, అభిషేక సామగ్రి సమర్పించారు. గర్భాలయంలో సీతారామలక్ష్మణ మూర్తులకు అభిషేకాలు చేసి, పట్టు వస్త్రాలు, పుష్పమాలికలు, ఆభరణాలతో ముస్తాబు చేశారు. అనంతరం ఆలయ పండితులు వేద పారాయణం, సహస్త నామార్చన, కుంకుమార్చన, మంగళహారతులతో విశేష పూజలు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణమూర్తులు

వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూకు నిధుల కళ

- ల్యాబ్‌ల ఏర్పాటుకు రూ. 6 కోట్లు మంజూరు
- 52 ల్యాబ్‌ల ఏర్పాటుకు మార్గం సుగమం




ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో మౌలికవసతులు ఏర్పాటుకు రూ. 6 కోట్లు నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. నూతనంగా ఏర్పాటైన విశ్వవిద్యాలయంలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు నిధులను విడుదల చేశారు.

- 2021 డిసెంబర్ 29న నిర్వహించిన 4వ ఎంఅండీసీ సమావేశంలో విశ్వవిద్యాలయంలో 28 ల్యాబ్‌ల ఏర్పాటుకు అంగీకారం తెలిపారు. ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ విభాగానికి 28 ల్యాబ్‌లు, ఫైన్ ఆర్ట్స్ విభాగానికి 24 ల్యాబ్‌లను ఏర్పాటు చేసేందుకు సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. దీంతో మొత్తం 52 ల్యాబ్‌ల ఏర్పాటు చేసేందుకు దానికి సంబంధించిన మెటీరియల్ కొనుగోలు చేసేందుకు నిధులు విడుదల చేశారు. ప్రభుత్వం విశ్వవిద్యాలయంకు నిధులు కేటాయించడం పట్ల విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ఆచార్య ఫజుల్ రెహమాన్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు కృషిచేసిన కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డికి, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులకు వారు ధన్యవాదాలు తెలిపారు.

నేడు జాతీయ ఉపకార వేతన పరీక్ష



ఎన్ఎంఎంఎస్ పరీక్ష కోసం ఏర్పాటు చేసిన కడపలోని మున్సిపల్ హైస్కూల్ మొయిన్ స్కూల్



పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు (ఫైల్)

పరీక్ష రాసే విద్యార్థులు: 2358
పరీక్షా కేంద్రాలు: 13
ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు: 1831
తెలుగు మీడియం : 517
ఉర్దూ మీడియం : 10
పరీక్షా సమయం: ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు

కడప ఎడ్యుకేషన్: జాతీయ ఉపకార వేతనం (ఎన్ఎంఎంఎస్) 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించిన పరీక్షను ఆదివారం నిర్వహించనున్నారు. జిల్లావ్యాప్తంగా 13 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరగనుంది. హాల్‌టికెట్స్‌ను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుడు ప్రభుత్వ పరీక్షల వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు అందచేశారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తే 9,10, 11, 12 తరగతుల వరకు ఏడాదికి రూ. 12 వేల చొప్పున విద్యార్థుల ఖాతాలకు ఉపకార వేతనం జమకానుంది.

- జిల్లాలోని కడపలో మూడు పరీక్షా కేంద్రాలలో, పులివెందుల్లో మూడు , జమ్మలమడుగులో నాలుగు, బద్వేల్‌లో మూడు పరీక్షా కేంద్రాలలో ఈ పరీక్షను నిర్వహించనున్నారు.

పరీక్షా కేంద్రాల వివరాలు ఇవే...

కడపలోని మున్సిపల్ హైస్కూల్ మొయిన్, మున్సిపల్ హైస్కూల్ ఉర్దూ, గాంధీగనర్ హైస్కూల్స్‌తో కలుపుకుని 538 మంది విద్యార్థులు, జమ్మలమడుగులో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, సెయింట్ మెరీస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, బాలాజీ ఇంగ్లీస్ మీడియం హైస్కూల్‌లో కలుపుకుని 784 మంది విద్యార్థులు, పులివెందుల్లో ప్రభుత్వ హైస్కూల్ రమణప్పసత్రం, జెడ్పీ హైస్కూల్ అంకాలమ్మపేట, ప్రభుత్వ జూనియర్ బాలికల హైస్కూల్‌లలో 538 మంది విద్యార్థులు, బద్వేల్‌లోని ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో రెండు సెంటర్లు, పాతిమా ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో 489 మంది.. ఇలా జిల్లావ్యాప్తంగా 13 పరీక్షా కేంద్రాలలో 2358 మంది విద్యార్థులు ఈ ఎన్ఎంఎంఎస్ పరీక్షను రాయనున్నారు. ఇందులో 517 మంది తెలుగు మీడియం విద్యార్థులు, 1831 మంది ఇంగ్లీష్ మీడియం , 10 మంది ఉర్దూ విద్యార్థులు ఉన్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం..



జాతీయ ఉపకార వేతన పరీక్షకు అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేశాం. పరీక్ష రాసే విద్యార్థులు పరీక్ష సమయానికి అరగంట ముందు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. విద్యార్థులు హాల్‌టికెట్, పెన్ను, పెన్సిల్, రబ్బర్, ప్యాడ్‌తో హాజరు కావాలి. విద్యార్థుల హాల్‌టికెట్‌లో ఫోటో సరిగా లేకపోతే సంబంధిత విద్యార్థి తమకు సంబంధించిన ఫోటోను హాల్‌టికెట్‌పై అతికించి ఫోటోపై ప్రధానోపాధ్యాయుడితో సంతకం చేయించుకుని రావాలి.

– చెప్పలి. దేవరాజు, జిల్లా విద్యాశాఖ అధికారి

మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయండి

- భక్తులకు ఇబ్బందులు లేకుండా పటిష్ట ఏర్పాట్లు
- కలెక్టర్ విజయరామరాజు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సిటీ : మహాశివరాత్రి మహోత్సవ ఏర్పాట్లను పటిష్టంగా నిర్వహించి ఉత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ విజయరామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫిబ్రవరి 18న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాల్లో మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై జేసీ సాయికాంత్‌వర్మ, మున్సిపల్ కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్, డీఎఫ్‌ఓ సందీప్‌రెడ్డి, ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనా, డీఆర్వో గంగాధర్‌గౌడ్‌తో కలిసి కలెక్టర్ విజయరామరాజు సమావేశం నిర్వహించి ఉత్సవ ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు.

- శైవ క్షేత్రాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వివరించారు. జిల్లాలో ప్రధానంగా పెండ్లిమర్రి మండలంలోని పొలతల శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానం, సిద్ధవటం మండలం వంతాటిపల్లెలోని శ్రీ నిత్యపూజస్వామి , బ్రహ్మంగారిమఠం మండలంలోని కందిమల్లాయపల్లెలో ఉన్న శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం, శ్రీ ఈశ్వరీదేవి మఠం, ప్రొద్దుటూరు మండలంలోని శ్రీ అగస్త్యేశ్వరస్వామి , గోపవరం మండలం ఓబులం గ్రామ పరిధిలో శ్రీ మల్లెం కొండేశ్వరస్వామి , చాపాడు మండలంలోని అల్లాడుపల్లెలో ఉన్న శ్రీ వీరభద్రస్వామి దేవాలయం, బద్వేలు మండలం లంకమల గ్రామంలోని శ్రీ లంకమల్లేశ్వరస్వామి , మైలవరం మండలంలోని అగస్తికోనలోని శ్రీ అగస్త్యేశ్వరస్వామి , జమ్మలమడుగు మండలంలోని కన్య తీర్థంలో ఉన్న శ్రీ ఈశ్వరస్వామి , ఖాజీపేట మండలంలోని పుల్లూరు గ్రామంలో ఉన్న శ్రీ నాగేశ్వరస్వామి , సింహాద్రిపురం మండలం అహోబిలపురంలోని శ్రీ భానుకోటేశ్వరస్వామి తదితర శైవ క్షేత్రాలకు అధిక సంఖ్యలో భక్తులు వస్తారని, వారందరికీ ఎలాంటి లోటుపాట్లు, ఇబ్బందులు లేకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని సంబంధిత ఆలయాల ఈఓలను ఆదేశించారు.

ఆలయాల వద్ద బారికేడ్లు, బందోబస్తు

శైవ క్షేత్రాలన్నింటిలోనూ అవసరమైన బారికేడ్లు, క్యూలైన్లతోపాటు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయా లని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతి క్షేత్రం వద్ద ఖచ్చితంగా పీఏ సిస్టమ్, కమాండ్ కంట్రోల్ రూమును ఏర్పాటు చేయాలన్నారు. శానిటేషన్ పను లు చేపట్టాలన్నారు. తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలన్నారు. విద్యుత్‌సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. వైద్య శిబిరంతోపాటు 108, 104 వాహనాలు, అగ్నిమాపక శిబిరం ఏర్పాటు చేయాలన్నారు. రహదారులన్నీ బాగుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రవాణాశాఖ అధికారులు అవసరమైన మేర బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాట్లు చేయాలన్నారు. గత సంవత్సరం ఉత్సవాల్లో ఎదుర్కొన్న సమస్యలపై దృష్టి సారించాలన్నారు. ప్రధానంగా పార్కింగ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. సంబంధిత ఆర్డీఓలు, తహసీల్దార్లు వారి పరిధిలో ఉన్న దేవాలయాల వద్ద సమావేశం ఏర్పాటు చేసి ఏర్పాట్లపై సమీక్షించాలన్నారు.

విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూడాలి

జేసీ సాయికాంత్‌వర్మ మాట్లాడుతూ శివరాత్రి ఉత్సవాల నిర్వహణలో భాగంగా విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి మేజర్ దేవాలయం వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు హెచ్చరికలు చేయాలన్నారు. అనంతరం మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు శ్రీనివాసులు, వెంకట రమణ, వెంకటేశ్వర్లు, కడప డీఎస్పీ వెంకట శివారెడ్డి, దేవాదాయశాఖ కమిషనర్ శంకర్ బాలాజీ, పీఆర్ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జీవన ప్రమాణాలు మెరుగుపరచాలి: జిల్లా కలెక్టర్

కడప సెవెన్‌రోడ్స్ : చిరు వ్యాపారుల గ్రూపులను ఏర్పాటు చేసి వారి జీవన ప్రమాణాలను, ఆర్థిక స్థితిని మెరుగు పరచాలని, డీఆర్‌డీఏ మెప్మా ఆధ్వర్యంలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులను నిర్ణీత లక్ష్యం మేరకు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు ఆయా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ వీసీ హాలులో డీఆర్‌డీఏ, మెప్మా పరిధిలో జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో జరుగుతున్న వివిధ రకాల పనుల పురోగతిపై డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు ఆనంద్ నాయక్, రామ్మోహన్‌రెడ్డిలతో కలిసి కలెక్టర్ క్షేత్ర స్థాయి అధికారులతో సమీక్షించారు.

- కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మహిళా స్వయం సహాయక సంఘాలతోపాటు వికలాంగులు, వృద్ధాప్య, ఎఫ్‌పీఓ, చిరు వ్యాపారుల గ్రూపులను ఏర్పాటు చేసి వారి జీవన ప్రమాణాలను మెరుగు పరచాలన్నారు. మెప్మా పరిధిలో పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా డీఆర్‌డీఏ పరిధిలో మండలాల్లో కూడా చిరు వ్యాపారులకు కూడా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసి పీఎం స్వనిధి, జగనన్న తోడు పథకాలతోపాటు వ్యాపారాభివృద్ధి కోసం గ్రూపుల వారీగా రుణ సదుపాయం కల్పించాలన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా ప్రాథమిక సెక్టారులోని వ్యవసాయం, ఇండస్ట్రియల్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహించాలన్నారు. పాత దుస్తులు, చిత్తు కాగితాలు ఏరుకునే వారికి కూడా ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించి బ్యాంకు రుణం అందించాలన్నారు. పేదలందరికీ ఇళ్ల హౌసింగ్ ప్రక్రియలో లబ్ధిదారులకు గృహ నిర్మాణం కోసం బ్యాంకు రుణాలు అందించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ, మెప్మా అధికారులు, ఏపీడీలు, డీపీఎంలు, సెర్ప్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా అంజన్న విగ్రహావిష్కరణ



క్రేన్ ద్వారా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

సింహాద్రిపురం : మండలంలోని అంకాలమ్మ గూడూరులో 31 అడుగులు అంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్టించారు. శనివారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఎంపీ, ఓఎస్డీలకు అర్చకులు అనిల్‌కుమార్ శర్మ పూర్ణ కుంభ స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతర ప్రత్యేక క్రేన్ ద్వారా అంజనేయ స్వామికి గజమాల వేసి, విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, కేశవరెడ్డి, సర్పంచ్ అంకాలమ్మ, ఉపసర్పంచ్ చల్లా శివ స్వప్నారెడ్డి, మహేశ్వరరెడ్డి,అశోక్‌రెడ్డి,పెద్ద శేఖరరెడ్డి,రమణారెడ్డి, బాబురెడ్డి, శ్రీనివాసులరెడ్డి, సోమకొండారెడ్డి, ఆనందరెడ్డి, ప్రభాకరరరెడ్డి ,విశ్వనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దీనులను ఆదుకునే తల్లి లూర్దుమాత



లూర్దుమాత స్వరూపాన్ని ఊరేగిస్తున్న విశ్వాసులు

కడప కల్చరల్ : లూర్దుమాత దీనులను ఆదుకునే తల్లి మరియాపురంకు చెందిన అభిషేకింపబడిన గురువులు పేర్కొన్నారు. లూర్దుమాత తిరునాల మూడోరోజు శనివారం జరిగిన ఆధ్యాత్మిక సభలో వారు ప్రసంగించారు. దీనులైన వారిని తల్లిగా మరియమాత దయతో ఆదరిస్తోందని, ప్రభువైన, లోకరక్షకుడైన ఏసుక్రీస్తు ద్వారా ఆమె దీనత్వం గల వారికి దైవం పక్షాన రక్షణ కల్పిస్తోందని పేర్కొన్నారు. విశ్వాసుల దీనత్వాన్ని చూసి ఆమె తన కుమారుడైన ఏసుక్రీస్తును లోకానికి పంపారని సెయింట్ జోసెఫ్స్ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి కారు శరత్ అన్నారు. అనంతరం ఫాదర్ అమృత్‌కుమార్ సమష్టిదివ్య బలిపూజ సమర్పించారు. కార్యక్రమంలో విచారణ గురువులు బిరుసు రాజా, చంద్ర, తిరునాల కమిటీ అధ్యక్షులు వారాది జోసెఫ్, ఉపాధ్యక్షులు పుల్లగుజ్జు విజయ్‌కుమార్, కార్యదర్శి పుల్లగూర లూర్దు, ట్రెజరర్ యు.విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అవినాష్‌రెడ్డి మచ్చలేని నాయకుడు

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



బ్రిడ్జిని పునఃప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి,చైర్‌పర్సన్

జమ్మలమడుగు : ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మచ్చలేని నాయకుడని, అతనిపై కొందరు అసత్యప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు.శనివారం ముద్దనూరు–జమ్మలమడుగు రహదారి పునఃప్రారంభం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీబీఐ ఎవరినైనా పిలుస్తుందని, మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డిని సైతం సిట్ విచారణకు హాజరయ్యారన్నారు. కేవలం ఎంపీ అవినాష్‌రెడ్డిపై కొన్ని పత్రికలు అత్యుత్సాహం ప్రదర్శించి చెడ్డపేరు తీసుకుని రావాలని చూస్తున్నాయన్నారు. ఆయన ఏనాడు ఫ్యాక్షన్ ను ప్రొత్సహించలేదని, అందరూ బాగుండాలని కోరుకునే నాయకుడన్నారు.

బ్రిడ్జిపై రాకపోకలు ప్రారంభం...

2021 సెప్టెంబర్ పెన్నాకు భారీ వరద రావడంతో హైలెవల్ బ్రిడ్జికి సంబంధించిన పిల్లర్ కుంగిపోయింది. దీంతో రాకపోకలు ఆగిపోయాయి. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండ పాత లోలెవల్ బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టారు.జనవరి నాటికి పనులు పూర్తి చేశారు. శనివారం ఎమ్మెల్యే మూలె సుధీర్‌రెడ్డి, చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మల చేతుల మీదుగా బ్రిడ్జిని పునఃప్రారంభించారు. దీంతో శనివారం నుంచి రాకపోకలను అధికారులు అధికారికంగా ప్రకటించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సింగరయ్య, హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ బడిగించల విజయలక్ష్మీ, పోరెడ్డి మహేశ్వరరెడ్డి, మల్కిరెడ్డి హనుమంతరెడ్డి, ముల్లాజానీ, ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మార్బల్ శ్రీను,కోఆప్షన్ సభ్యుడు లక్షుమయ్య, కౌన్సిలర్ పోచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో తిరిగే దమ్ము టీడీపీ నాయకులకు లేదు

ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి. చిత్రంలో తిరుపాల్‌రెడ్డి తదితరులు

చాపాడు : టీడీపీ ప్రభుత్వం 2014 నుంచి 2019 వరకు ప్రజలకు చేసిన అన్యాయంతో ఆ పార్టీ నాయకులకు ఇప్పుడు ప్రజల్లో తిరిగే దమ్ము, ధైర్యం లేదని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ సలహాదారుడు తిరుపాల్‌రెడ్డి పేర్కొన్నారు. చంద్రబాబుకు తన మీద.. తన కొడుకు లోకేష్ మీద నమ్మకం లేక వైఎస్సార్‌సీపీని ఎదుర్కొనేందుకు అన్ని పార్టీల మద్దతు కావాలని పొత్తుల కోసం వెంపర్లాడుతున్నారన్నారు. శనివారం మండలంలోని అన్నవరంలో గ్రామ సచివాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో 95శాతం జగన్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. దీంతో ప్రజల వద్దకు వెళ్లి చేసిన మేలు చెప్పుకుంటున్నామన్నారు. లోకేష్ పాదయాత్ర పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్న సామెతలా ఉందన్నారు. వైఎస్ జగన్ పాదయాత్ర చేసి సీఎం అయ్యాడని, లోకేష్ కూడా ఈ విధంగా చేస్తున్నాడన్నారు. నక్కల వాతలు పెట్టుకుంటే పులి అవుతుందా.. పాదయాత్ర చేస్తే జగన్ అంతటి నేత అవుతాడా అని అన్నారు. పాదయాత్ర చేసినా, పొర్లు దండాలు పెట్టినా, పాకుతూ పోయినా ప్రజలు ఆశీర్వదించరన్నారు. ప్రజలంతా సీఎం జగన్ పాలన వైపే ఉన్నారన్నారు. అర్హత ఉంటే చాలు టీడీపీ నాయకులకు కూడా పథకాలు వస్తున్నాయని తెలిపారు. ప్రతి పంచాయతీలో కోటాది రూపాయలతో అభివృద్ధి సంక్షేమం కన్పిస్తుందన్నారు. రాష్ట్రంలో పంటలు బాగా పండి అధిక దిగుబడులు రాగా, ధరలు కూడా గిట్టుబాటుగా ఉండటంతో రైతాంగం సుభిక్షంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లక్షుమయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, మైదుకూరు మార్కెట్ కమిటి చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, గృహ సారధుల కన్వీనర్ అన్నవరం రామోహన్‌రెడ్డి, జేష్టాది శాంతరాజు తదితరులు పాల్గొన్నారు.

కీర్తి న్యూరోలో విజయవంతంగా పక్షవాత చికిత్స



చికిత్స తీసుకున్న శాంతమ్మతో డాక్టర్ కీర్తి

తిరుపతి తుడా : తిరుపతి – కరకంబాడి రోడ్డులోని కీర్తి న్యూరో అండ్ ఎమర్జెన్సీ ఆస్పత్రిలో మహిళ(80)కు పక్షవాత చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్టు డాక్టర్ కీర్తి తెలిపారు. శ్రీకాళహస్తికి చెందిన కె.శాంతమ్మకు రెండోసారి పక్షవాతం తీవ్రస్థాయిలో రావడంతో అత్యవసర చికిత్స కోసం చేర్పించారని తెలిపారు. దీంతో ఆమె గంటలోనే పూర్తిగా కోలుకున్నారని పేర్కొన్నారు. లక్షణాలు ఎవరికైనా ఉంటే ముందస్తు చికిత్స తీసుకోవడం వల్ల వ్యాధిని పూర్తిస్థాయిలో నయం చేసుకోవచ్చన్నారు. పక్షవాతం సోకిన గంటలోపు చికిత్స తీసుకుంటే పూర్తిగా వ్యాధి నుంచి కాపాడవచ్చని వివరించారు.

శేఖర్‌రెడ్డితో వైఎస్సార్‌సీపీకి ఎలాంటి సంబంధం లేదు

కడప కార్పొరేషన్: జమ్మలమడుగు నియోజకవర్గంలో గంగవరం శేఖర్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీకి ఎలాంటి సంబంధం లేదని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కె. సురేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. జమ్మలమడుగు నియోజకవర్గ వ్యవహారాల్లో తలదూరుస్తు ఆయన పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ సందర్భంగా మీడియాలో వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమన్నారు. అతని చర్యలు ఇలాగే కొనసాగితే పార్టీ తరుపున క్రమశిక్షణ చర్యలు, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని కె. సురేష్ బాబు హెచ్చరించారు.

టైరు పగిలి..అంబులెన్స్ బోల్తా

– మహిళ మృతి : మరో ఇద్దరికి గాయాలు

కడప అర్బన్ : కడప అలంఖాన్‌పల్లెలోని దండు వద్ద జమ్మలమడుగు నుంచి వచ్చిన అంబులెన్స్ ముందు టైరు పగిలి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జమ్మలమడుగు మండలం దేవగుడి గ్రామానికి చెందిన మంగళి లక్ష్మీదేవి (58) మృతి చెందింది. లక్ష్మీదేవి శనివారం వేరుశనగ పంట కోసేందుకు ఉదయం పొలంలోకి వెళ్లింది. అక్కడ పనిచేస్తుండగా గుండెనొప్పి వచ్చింది. ఆమెను చికిత్స నిమిత్తం జమ్మలమడుగులో చేర్పించారు. అక్కడి వైద్యుల సూచనలమేరకు అదే ఆసుపత్రికి చెందిన అంబులెన్స్‌లో కడపకు పంపించారు. సంఘటన స్థలానికి రాగానే టైరు పగిలి అంబులెన్స్ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లక్ష్మీదేవి మృతి చెందగా, ఆమె వెంట వచ్చిన బంధువులు సుబ్బరాయుడు, మరో వ్యక్తి గాయపడ్డారు. గాయపడిన వారిని చికిత్స కోసం రిమ్స్‌కు తరలించారు.

305 కేసులు నమోదు

కడప అర్బన్ : హెల్మెట్, సీటు బెల్ట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలియజేశారు. హెల్మెట్, సీటు బెల్ట్ ధరించడం వల్ల విలువైన ప్రాణాలను సురక్షితంగా ఉంచుకోవచ్చన్నారు. శనివారం వాహనాల స్పెషల్ డ్రైవ్‌లో మొత్తం 305 కేసులు నమోదు చేశారు. ఇందులో హెల్మెట్ లేని కేసులు 269 కేసులు, సీటు బెల్ట్, ధరించకుండా కార్లు, జీపులు నడిపిన వాహనచోదకులపై 36 కేసులు నమోదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



నాగరాజు మృతదేహం

చింతకొమ్మదిన్నె : ఊటుకూరు సమీపంలో గల భారత్ పెట్రోల్ బంకు ఆవరణలోని గదులకు వెనుక భాగాన శనివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి శవం లభించింది. ఈ విషయాన్ని పెట్రోల్ బంకు సిబ్బంది తమ దృష్టికి తీసుకువచ్చారని సీకేదిన్నె ఇన్‌చార్జి ఎస్ఐ ఎన్. రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. పోలీసలు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు 30 నుంచి 35 సంవత్సరాలు ఉంటుందని ఎస్ఐ తెలిపారు. అతని వద్ద పురుగుల మందు బాటిల్ కొన్నట్లు రశీదు లభించిందన్నారు. మృతుడి ఫొటో తీసి జిల్లా స్థాయిలో వివిధ వ్యవస్థల ద్వారా పరిశీలించగా ఆచూకీ లభించిందన్నారు. చనిపోయిన వ్యక్తి మైదుకూరు మండలం గంజికుంట గ్రామానికి చెందిన చిన్న దండ్లూరు నాగరాజు(30)గా గుర్తించామన్నారు. ఇతను టిప్పర్ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం కొనసాగించేవాడన్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు తెలిసిందన్నారు. నాగరాజు మృతికి సంబంధించి కారణాలు తెలియరాలేదని వెల్లడించారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

పందుల యజమానులపై క్రిమినల్ కేసులు

చెన్నూరు : చెన్నూరు టౌన్‌లో పందులను, వాటి యజమానులు ఇష్టానుసారంగా వదలడంతో అవి పంట పొలాలు, ఇంటి పరిసరాల్లోని మొక్కలను నాశనం చేస్తున్నాయని ప్రజలు పోలీసులు ఫిర్యాదు చేశారు. దీంతో చెన్నూరు పోలీసులు తగిన చర్యలు చేపట్టారు. పందుల యజమానులను స్థానిక పోలీసుస్టేషన్‌కు పిలిపించి పలుమార్లు కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా వారిలో మార్పు రాకపోవడంతో వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు ఎస్ఐశ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఇప్పటికైనా పందులను ఊరికి దూరంగా పంపకపోతే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఆటో బోల్తా : డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

అట్లూరు : ఆటో బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ నాగరాజు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు మండల పరిధిలోని శలంగారిపల్లి గ్రామానికి చెందిన నాగరాజు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కడప-బద్వేలు ప్రధాన రహదారిపై రెడ్డిపల్లి సమీపంలో మలుపు తిరుగుతుండగా ఆటో బోల్తాపడింది. నాగరాజుకు తీవ్రగాయాలయ్యాయి.అతన్ని 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

తొలిదశలో గుర్తిస్తే క్యాన్సర్ నియంత్రణ సాధ్యమే



మాట్లాడుతున్న రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ

కడప అర్బన్ : క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించి చికిత్స అందిస్తే నియంత్రణ సాధ్యమేనని కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) ఓపి విభాగంలో కళాశాల ఎస్.ఎస్.ఎస్. ఇన్‌ఛార్జ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజు దాసరి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, కళాశాల సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ మాట్లాడుతూ రిమ్స్ ఆసుపత్రిలో క్యాన్సర్ ఓపీ బ్లాక్ ప్రారంభమైందన్నారు. అందులో నైపుణ్యం కలిగిన డాక్టర్లు అందుబాటులో ఉన్నారన్నారు. క్యాన్సర్ ఒక మహమ్మారి, కానీ దీనిని తొలిదశలోనే గుర్తించి చికిత్స అందిస్తే నియంత్రణ సాధ్యమేనన్నారు. ఈ కార్యక్రమంలో క్యాన్సర్ వ్యాప్తిపై అవగాహన, నియంత్రణ గురించి పలువురు వైద్యులు ప్రసంగించారు.ప్రజలు క్యాన్సర్ ఓపీ సేవలను వినియోగించుకుని ఆరోగ్యకరమైన జీవితాన్ని జీవించాలన్నారు. కార్యక్రమంలో రిమ్స్ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వరలక్ష్మి, ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు, వైద్యులు, నర్సింగ్ సూపరింటెండెంట్‌లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం





మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు (ఇన్‌సెట్) వెంకటయ్య (ఫైల్)

గోపవరం : ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చొరవతో సౌదీ అరేబియాలో జనవరి నెల 7వ తేదీన గుండెపోటుతో మృతిచెందిన వ్యక్తి మృతదేహం శనివారం స్వగ్రామానికి చేరుకుంది. వివరాలు.. మండలంలోని రాచాయపేట గ్రామ పంచాయతీ వడ్డెఅగ్రహారం గ్రామానికి చెందిన గండికోటవెంకటయ్య (61) బతుకుదెరువు కోసం కొన్నేళ్ల కిందట సౌదీఅరేబియా వెళ్లాడు. రెండు నెలల క్రితం స్వగ్రామానికి వచ్చి తిరిగి వెళ్లాడు. ఈ నేపథ్యంలో జనవరి 7వ తేదీన గుండెపోటుకు గురై మృతి చెందినట్లు స్థానికుల ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. అయితే మృతదేహం స్వగ్రామానికి వచ్చే అవకాశం లేదని తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఎంపీ వైఎస్అవినాష్‌రెడ్డి, అడా చైర్మన్ సింగసానిగురుమోహన్ దృష్టికి తీసుకెళ్లారు. వారు వెంటనే జిల్లా కలెక్టర్ విజయరామరాజు దృష్టికి తీసుకెళ్లి సౌదీఅరేబియాలో ఉన్న ఇండియన్ ఎంబసీ వారితో మాట్లాడారు. దీంతో మృతదేహాన్ని ఇండియాకు పంపించేందుకు వారు అంగీకరించారు. శుక్రవారం సౌదీఅరేబియా నుండి చెన్నై ఎయిర్‌పోర్టుకు మృతదేహాన్ని పంపారు. అక్కడి నుంచి కుటుంబ సభ్యులు మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వెంకటయ్య కుటుంబ సభ్యులు ఎంపీ అవినాష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వైఫల్యాలను తగ్గించి విద్యుత్ సరఫరా చేయండి



మాట్లాడుతున్న ఎన్‌వీఎస్ సుబ్బరాజు

మైదుకూరు : ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలను తగ్గించి వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని ఏపీ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (టెక్నికల్) ఎన్‌వీఎస్ సుబ్బరాజు విద్యుత్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన మైదుకూరు విద్యుత్ డివిజన్ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని డీఈఈ, ఏఈఈలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంతకుముందు 33 కేవీ సబ్ స్టేషన్, ఏడీఈ, ఏఈ కార్యాలయాలను ఆయన పరిశీలించారు.అనంతరం మాట్లాడుతూ మైదుకూరు డివిజన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిని నియంత్రించాలని సూచించారు. యూనిట్ విద్యుత్‌ను ఏడు రూపాయలతో కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. అందు వల్ల విద్యుత్‌ను వృథా చేయకుండా చూడాలని తెలిపారు.విద్యుత్ చౌర్యంపై దృష్టి పెట్టి, దాడులు నిర్వహించి అరికట్టాలని ఆదేశించారు. ఇళ్లు పూర్తయిన జగనన్న కాలనీల్లో మీటర్లు ఏర్పాటు చేసి, విద్యుత్ సరఫరా ఇవ్వాలని సూచించారు. రైతులకు కొత్త సర్వీసులు ఇవ్వడంలో జాప్యం చేయొద్దని ఆదేశించారు. సంస్థ ఆర్థిక పరిస్థితి మెరుగు పడాలంటే నష్టాలను అరికట్టాలని, బకాయిలను వసూలు చేయాలని తెలిపారు. విద్యుత్ ప్రమాదాలను అరికట్టాలన్నారు. వినియోగదారుల సమస్యలను 1912కు ఫోన్ చేసి పరిష్కరించుకోవాలన్నారు. సమావేశంలో మైదుకూరు విద్యుత్ ఈఈ జీవీ రామిరెడ్డి, డీఈఈ, ఏఈఈ, ఏఈలు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షణకు అనుమతించండి



గిరి ప్రదక్షణ మూహుర్త పత్రాన్ని ప్రదర్శిస్తున్న భారవి తదితరులు

కడప కల్చరల్ : పుష్పగిరి క్షేత్రంలో గిరి ప్రదక్షణకు అనుమతించాలని శ్రీరామరాజ్యం, హిందూత్వ చైతన్యవేదిక ప్రతినిధి న్యాయవాది సట్టి భారవి అధికారులను కోరారు. ఇటీవల తాము పుష్పగిరిలో పూర్వం కొనసాగినట్లు గిరి ప్రదక్షణను పునః ప్రారంభించాలని పుష్పగిరి పీఠాధిపతిని కోరామని, ఆయన అందుకు సమ్మతించారని తెలిపారు. ఈ సంవత్సరం గిరి ప్రదక్షిణను మార్చి 1న నిర్వహించాలని ఆయనే స్వయంగా ముహూర్తం నిర్ణయించినట్లు చెప్పారు. ఈ మేరకు ముహూర్తపు పత్రాలను ఎర్రముక్కపల్లె శ్రీ మారెమ్మ ఆలయంలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము ఈ లేఖను జిల్లా దేవదాయశాఖ అధికారులకు సమర్పిస్తున్నామన్నారు. గిరి ప్రదక్షణ గురించి పుష్పగిరి పీఠాధిపతితో చర్చించి మార్చి 1న శాఖాపరంగా అన్ని ఏర్పాట్లు చేయాలని కోరుతున్నామన్నారు.

పట్టు పరిశ్రమతో అధిక లాభాలు



సిద్దవటంలోని పట్టుపురుగుల షెడ్డును పరిశీలిస్తున్న పట్టు పరిశ్రమశాఖ అడిషనల్ డైరెక్టర్ అరుణకుమారి

సిద్దవటం : మండలంలోని సిద్దవటం..మోదీన్‌సాబ్ పల్లె గ్రామాల్లో ఉన్న పట్టు పరిశ్రమ షెడ్లను, మల్బరీ పంటలను శనివారం పట్టుపరిశ్రమల శాఖ అడిషనల్ డైరెక్టర్ అరుణకుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్ఆర్ జిల్లాలో దాదాపు 1000 ఎకరాల్లో మల్బరీ పంట సాగు చేస్తున్నారన్నారు. రైతులకు ఇది లాభసాటిగా ఉంటుందన్నారు. పట్టు పరిశ్రమ ద్వారా ఎకరాకు రూ.1,50,000 నుంచి రెండు లక్షల రూపాయల వరకు ఆదాయం వస్తుందని అన్నారు. పెట్టుబడి తక్కువ, ఆదాయం ఎక్కువ అని ఆమె అన్నారు. మండలం లోని మోదీన్‌సాబ్‌పల్లె, సిద్దవటం గ్రామాల్లో రైతులు చెన్నారెడ్డి, హరిలకు సూచనలు, సలహాలు ఇచ్చారు.కార్యక్రమంలో డీడీ షాహిదాబేగం, అన్నమయ్య జిల్లా డీడీ రాజశేఖర్‌రెడ్డి, కడప పట్టు పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాసులరెడ్డి, గుటూరు జిల్లా పట్టుపరిశ్రమల అధికారులు సుధాకర్, వెంకటరామరాజు రైతులు చెన్నారెడ్డి, హరి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డా. వల్లూరు బ్రహ్మయ్య

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు క్రీడాకారుల నుంచి చక్కటి స్పందన లభించింది. ఈ పోటీల ప్రారంభోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథులుగా జిల్లా మైనార్టీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య, స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్ విచ్చేసి ఎంపికలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం ద్వారా యువత మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసికోల్లాసం పొందొచ్చన్నారు. నెహ్రూయువకేంద్రం జిల్లా సమన్వయకర్త మణికంఠ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లాలోని పలు బ్లాక్‌ల పరిధిలోని పోటీలు నిర్వహించామని తెలిపారు. అనంతరం సాయంత్రం నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి సమగ్రశిక్ష అభియాన్ అధికారి ఎ. ప్రభాకర్‌రెడ్డి విచ్చేసి విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ టోర్నమెంట్‌లో ప్రథమ బహుమతి కడప మరియాపురం జట్టు గెలుపొందగా, ద్వితీయ బహుమతి రాయచోటి జట్టు నిలిచింది. కార్యక్రమంలో డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎన్.వి.పి. అమృత్‌రాజ్, కోచ్‌లు పాల్గొన్నారు.